






# మనం

MANAM

చిత్తూరు I తిరుపతి

గురువారం 25 జూన్ 2026

4 పేజీలు



## ప్రభుత్వ ఉద్యోగులకు బాసటగా ముఖ్యమంత్రి

● గొల్ల నరసింహ యాదవ్



తిరుపతి జూన్ 24 మనం న్యూస్:ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు బాసటగా ఉంటారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతిలో గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి రెండు అత్యంత కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగ వర్గాల్లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కింది సౌకర్యాలను కల్పించింది:11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ పరిధిలో ఉన్న సుమారు 10,715 నుండి 11,000 మంది ప్రభుత్వ ఉద్యోగులను పాత పెన్షన్ విధానం లోకి మార్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎవరికి వర్తిస్తుంది?: సెప్టెంబర్ 1, 2004 కంటే ముందు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అయ్యి, ఆ తేదీ తర్వాత ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులందరికీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక సారి మాత్రమే పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. ప్రయోజనం: దీనివల్ల రిటైర్ అయిన తర్వాత ఉద్యోగులకు, వారి కుటుంబాలకు సర్వీస్ పెన్షన్

2లో




### తిరుపతిలో దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ముఖ్యమంత్రిమార్గదర్శకత్వంల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

● తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు:జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, జూన్ 24, మనం న్యూస్: తిరుపతి నగరం మరియు పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి భూ సమస్యలపై నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిష్కార మార్గాలను రూపొందిస్తున్నామన్నారు. దామినేడు, శ్రీనివాసపురం, పద్మావతి నగర్, సాయినగర్, కరకంబాడి, సీతారాం నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించామని, సంబంధిత అధికారుల నుంచి నివేదికలు సేకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తిరుపతి నగర ప్రాంతంలో వివిధ రకాల భూ వర్గీకరణల కారణంగా దశాబ్దాలుగా సమస్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. మఠం భూములు, చెరువులు, కాలువలు, వాగులు, రివర్ పోరంబోకు తదితర భూములపై వేలాది కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దామినేడు ప్రాంతంలో సుమారు 262 ఎకరాల్లో సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని, అనేక సంవత్సరాలుగా భూముల కొనుగోలు విక్రయాలు జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, విద్యా అవసరాల కోసం ఆస్తులను వినియోగించుకునే అవకాశం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేదలకు భూ హక్కులు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించినట్లే, ప్రస్తుతం ఉన్న సమస్యలపై కూడా చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. డీకేటీ భూములు, పీవోటీ నిబంధనల కారణంగా ఉత్పన్నమైన సమస్యలను కూడా అధ్యయనం చేసి, చట్టబద్ధంగా ప్రజలకు హక్కులు కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. రూరల్ మరియు అర్బన్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ భూ సమస్యలు ఉన్నాయో గుర్తించి, అవసరమైతే కేబినెట్ స్థాయిలో నిర్ణయాలు తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. తిరుపతిని రాష్ట్ర అభివృద్ధి

2లో

## చిన్నగొట్టిగల్లులో.. వి.సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం



● ఎంపీ శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు

చంద్రగిరి,( చిత్తూరు): చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన వి.సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీ అనగాని సత్య ప్రసాద్ గారు,మాజీ ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారు, చంద్రగిరి ఎమ్మెల్యే శ్రీ పులివర్తి నాని గారు, పీలేరు ఎమ్మెల్యే శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు గారితో కలిసి పాల్గొన్నారు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు.వి.సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ అనంతరం నిర్వహించిన సమావేశంలోచిత్తూరు ఎంపీ శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు మాట్లాడారు.. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి, యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ బాబు గారు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, విద్యారంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా వి.సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పనిచేస్తుందని, ఇందులో ఏ మాత్రం సందేహం లేదన్నారు.

## ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప.....



శ్రీకాళహస్తి శాసనసభ్యులు శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు... వంకాయల సిద్దులయ్య గారు మనం నిర్మించబోతున్న అయ్యప్ప స్వామి వారి దేవాలయంలోని ముఖ్య కట్టడం గర్భాలయ నిర్మాణానికి దాదాపు 1,20,000 లు రూపాయలు సహాయ సహకారాలు అందించడం చాలా సంతోషకరమైన విషయము... కనుక శ్రీకాళహస్తి శాసనసభ్యులు శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారి కుటుంబ సభ్యులకు మరియు వంకాయల సిద్దులయ్య గారి కుటుంబ సభ్యులకు శ్రీ పూర్ణ పుష్కలాంబా సమేత శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి దివ్య అనుగ్రహాలు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ .. శబరిమల అయ్యప్ప స్వామి వారి తత్వామసి సేవాసమితి కమిటీ సభ్యులు...

# అనుమతిస్తే అన్న క్యాంటీన్,డిగ్రీ కాలేజీని నిర్మిస్తా..!

● వలసారెడ్డి శివప్రసాద్ రెడ్డి
● ఆ బాధ్యత నాదే… మంత్రి అనగాని
● తన వంతు సహకారం అందిస్తా… ఎంపి దగ్గుమళ్ళ
● ప్రతిపాదనకు సిద్ధం చేస్తా… కలెక్టర్ వెంకటేశ్వర్
● ఆ కుటుంబంతో విడదీయరాని బంధం ఉంది.. మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి
● వలసారెడ్డి సేవా స్ఫూర్తి ఆదర్శం -ఎమ్మెల్యే పులివర్తి నాని



చిన్నగొట్టిగల్లు జూన్ 24 మనం న్యూస్ :ప్రభుత్వం అనుమతిస్తే చిన్నగొట్టిగల్లులో మరో డిగ్రీ కాలేజిని నిర్మిస్తానని, అలాగే అన్న క్యాంటీన్ ను నిర్మిస్తే అందుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చి శాశ్వతంగా పేదోళ్ళ ఆకలి బాధల్ని తీరుస్తానని వలసారెడ్డి శివప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి భరోసా ఇచ్చారు. బుధవారం వలసారెడ్డి కుటుంబీకుల సమక్షంలో వి.సిద్దరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశా లకు మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ,మంత్రి అనగా ని సత్య ప్రసాద్,కలెక్టర్ వెంకటేశ్వర్,ఎమ్మెల్యే పులివర్తి నాని,ఎంపి దగ్గుమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి లు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడు తూ అన్న క్యాంటీన్ నిర్మాణం, డిగ్రీ కాలేజీకి అవసరమైన అనుమతులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఎంపీ చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ జూనియర్ కాలేజీకి అవసరమైన అనుమతులను సమకూర్చుటకు తన వంతు సహకరిస్తానని వెల్లడించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ వలసా రెడ్డి కుటుంబీకులు సేవా స్ఫూర్తి పలువురికి ఆదర్శప్రాయం అన్నారు. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వలసారెడ్డి కుటుంబీకులతో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. ప్రజలకు వారు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ వలసారెడ్డి కుటుంబీకులు చేపట్టిన కొల్లాపురమ్మ ఆలయం,తలకోన అన్నదాన సత్రం, వృద్ధాశ్రమం, కల్యాణ మండపం, కాలేజీ నిర్మాణం ఎంతో ప్రజాదరణ పొందాయన్నారు. ఎన్టీఆర్ హయాంలో చిన్నగొట్టిగల్లు కళాశాలను స్థాపించడం, తన హయాంలో వలసారెడ్డి దాతృత్వంతో మరో నూతన కళాశాలకు ప్రారంభోత్సవం చేయడం ఎప్పటికి మరిచిపోలేనని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య, అవసరమైన విద్య సామగ్రితో పాటు తల్లికి వందనం పథకంతో వరఒడిలను సృష్టిస్తున్నారని అన్నారు.

## రోడ్డు భద్రత,మత్తు పదార్థాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



మదనపల్లె జూన్ 24,మనం న్యూస్:మదనపల్లిలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత,మత్తు పదార్థాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగింది.వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో *జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి 100 ఉచిత హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రమాదాల బారిన పడకుండా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఎస్పీ ఆదేశాలతో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి యువతలో చైతన్యం కోసం పోలీసు ప్రధాన కార్యాలయం నుండి అన్నమయ్య సర్కిల్ వరకు భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు.అనంతరం చాముండేశ్వరి సర్కిల్ వద్ద మత్తుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టి, ఆరోగ్యకరమైన మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ బృహత్తర కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీ ఆర్.వి.కృష్ణ కిషోర్, వెలుగు సంస్థల కార్యదర్శి ఉదయ్ మోహన్ రెడ్డి, సర్వోదయ ప్రెసిడెంట్ ఆదినారాయణ రెడ్డి, ట్రాఫిక్ సీఐ గురునాథ్, ఇతర పోలీసు, మున్సిపల్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు విశేషంగా పాల్గొన్నారు.



## సబ్సిడీతో పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ

శాంతిపురం మండలం జూన్ 24 మనం న్యూస్:మండల పరిధిలోని రాళ్ళబూదుగురు పశువుల వైద్యశాల వద్ద పాడి రైతుల పై ఆర్థిక భారం పడకుండా పశుసంపద ద్వారా అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో బుధవారం పశు దాణా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు పాడి రైతులకు సబ్సిడీ పశు దాణా బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అన్ని వేళల అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పాడి రైతులపై పెరుగుతున్న పశు దాణా ఖర్చు భారాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తోందని చెప్పారు. ఈ పథకం ద్వారా పాల దిగుబడి పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతులకు పశుసంపద అభివృద్ధి కీలకమని, ప్రతి రైతు కుటుంబం పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

## క్యాన్సర్ బాధితుడి వైద్య చికిత్సకు ప్రధాని సహాయ నిధి నుండి రూ.3 లక్షల మంజూరు

● మంజూరు లేఖను అందజేసిన ఎస్. నిసార్ అహమద్.



మదనపల్లె, జూన్ 24,మనం న్యూస్ మదనపల్లె పట్టణంలోని ఇందిరానగర్ నివాసి శ్రీ గొల్లపల్లి అబ్దుల్ ఖయ్యూం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని రామయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం రాజంపేట గౌరవ పార్లమెంట్ సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధాన మంత్రి సహాయ నిధి (PMN-RF) నుండి రూ.3.00 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు.ఈ మేరకు మంజూరైన నిధులకు సంబంధించిన అధికారిక లేఖను మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ ఎస్. నిసార్ అహమద్ గారు అబ్దుల్ ఖయ్యూం సతీమణి శ్రీమతి ఫౌజియాకు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్. నిసార్ అహమద్ గారు మాట్లాడుతూ, “ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రజా ప్రతినిధుల బాధ్యత. అబ్దుల్ ఖయ్యూం గారి కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని గౌరవ పార్లమెంట్ సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ప్రధాని సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా విశేష కృషి చేశారు. ఈ సహాయం వారి కుటుంబానికి కొంత ఊరటనిస్తుందని ఆశిస్తున్నాము” అని అన్నారు.అలాగే ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తామని” తెలిపారు.ఈ సందర్భంగా అబ్దుల్ ఖయ్యూం కుటుంబ సభ్యులు తమకు పెద్దమనసుతో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన పార్లమెంట్ సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గారికి, సమన్వయకర్త శ్రీ ఎస్. నిసార్ అహమద్ గారికి, లియాఖత్ ఆలీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు జింకా చలపతి, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి ఎస్ రెడ్డి, నాయకులు లియాఖత్ ఆలీ, తట్టి నాగరాజ రెడ్డి, ఎన్ నవాజ్, తాళే సుబ్రహ్మణ్యం, మొహమ్మద్ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహా స్వామి కి సింహవాహన సేవ.



కలికిరి జూన్ 24 మనం న్యూస్ : కలికిరి నడిబొడ్డున కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి మూడవరోజు బుధవారం స్వామి వారి ని సర్వాంగ సుందరంగా అలంకరించి, మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు . సాయంత్రం స్వామి వారిని సింహ వాహనంపై ప్రతిష్టించి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించిన పోలీసులు.

● బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన పోలీసు అధికారులు.

తిరుపతి జూన్24 మనం న్యూస్:తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు విసిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను నిర్వహించి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మత సామరస్యం, సామాజిక ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గుర్తు తెలియని ఫోన్ కాల్స్, లింకులు, నకిలీ పెట్టుబడి ఆఫర్లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా ద్వారా ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అధికారులు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డైల్ 112, పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఇలాంటి విసిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ, బాలల అదృశ్యం, కిడ్నాప్‌లపై, అప్రమత్తంగా ఉండాలని సూచన.

● మొబైల్ గేమ్స్ వ్యసనం, అపరిచిత వ్యక్తుల పట్లజాగ్రత్తలపై అవగాహన.



తిరుపతి జూన్ 24 మనం న్యూస్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, విద్య విలువలపై చైతన్యం కల్పించిన పోలీసులు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో శక్తి బృందం సభ్యులు తిరుపతిలోని నెహ్రూ మునిసిపల్ గ్రౌండ్‌లో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాలల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. అలాగే బాలల అదృశ్యం, కిడ్నాప్‌ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ, అపరిచిత వ్యక్తులతో మాట్లాడేటప్పుడు లేదా వారిని అనుసరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అధికంగా మొబైల్ గేమ్స్‌కు అలవాటు పడటం వల్ల విద్య, ఆరోగ్యం, మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరానికి అనుగుణంగా మాత్రమే వినియోగించాలని సూచించారు. అలాగే క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి అవసరమైన లక్షణాలపై చైతన్యం కల్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, విద్య జీవితంలో అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. సమాజంలో ఇటీవల బాలలకు సంబంధించిన వివిధ ఘటనలు, కేస్ స్టడీలను ఉదాహరణగా వివరిస్తూ జాగ్రత్తలు సూచించారు.కార్యక్రమంలో భాగంగా అత్యవసర సమయాల్లో వినియోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. బాలల సహాయవాణి 1098, పోలీసు అత్యవసర సేవల నంబర్ 112, మహిళల భద్రత కోసం 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను ప్రజలకు వివరించారు.బాలల భద్రత, విద్యాభివృద్ధి, నైతిక విలువల పెంపొందన, నేరాల నివారణ లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తిరుచానూరు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ఆమోదం లభించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆవిలాల చెరువు అభివృద్ధికి తొలి దశలో రూ.31 కోట్లతో టెండర్లు పిలిచామని, మొత్తం రూ.110 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, తిరుపతికి వచ్చే భక్తులు అదనంగా ఒకటి లేదా రెండు రోజులు గడిపేలా మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

కొంతమంది రాజకీయ నాయకులు మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. ఆవిలాల భూముల అంశంపై జరుగుతున్న ప్రచారాలన్నీ వాస్తవాలకు విరుద్ధమని, సంబంధిత వ్యవహారాల్లో కోర్టు ఉత్తర్వులు, రెవెన్యూ అధికారుల నిర్ణయాలు, చట్టబద్ధ ప్రక్రియల అనంతరమే చర్యలు జరిగాయని స్పష్టం చేశారు.మఠం భూముల సమస్యలపై ఎండోమెంట్స్ శాఖ అధికారులు, మంత్రులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, హక్కుదారులతో చర్చలు జరిపి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైతే తానే స్వయంగా సంబంధిత వర్గాలతో సమావేశమై సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూ సమస్యలపై వందలాది మంది ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామని, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి, తిరుపతి, చంద్రగిరి మరియు పరిసర ప్రాంతాల్లోని భూ సమస్యల పరిష్కారానికి తుది కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఏపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బాసటగా ముఖ్యమంత్రి

మరియు ఫ్యామిలీ పెన్షన్ రూపంలో పూర్తి ఆర్థిక భద్రత లభిస్తుంది.ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపురాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేషన్లు, సొసైటీలు, గురుకులాలు వసతి విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుండి 62 ఏళ్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

## రూ.15 లక్షల నగదు దోపిడీ

# కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు

● 8 మంది నిందితుల అరెస్ట్ – రూ. 3,00,000/- నగదు, నాలుగు వాహనాల స్వాధీనం.

● కర్ణాటక, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన నిందితుల ముఠాగా గుర్తింపు.



తిరుపతి జూన్24 మనం న్యూస్: అంతర్ రాష్ట్ర 8 మంది దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి మూడు లక్షల నగదు నాలుగుకారులను స్వాధీనం చేసుకున్నట్లు ఏ ఎస్ పి శ్రీనివాసులు తెలిపారు.తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరిధిలోని శ్రీకాళహస్తి–తిరుపతి జాతీయ రహదారి లో అంజిమేడు బస్ స్టాప్ సమీపంలోని దీప్ పంజాబీ దాబా వద్ద జూన్ 2026న జరిగిన రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును తిరుపతి జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నగదు నేరానికి వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టు, స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాల వివరాలను మీడియాకు వివరించారు.ఫిర్యాదుదారు రవీంద్రరెడ్డి అలియాస్ వేణు తన వద్ద ఉన్న రూ.15 లక్షల నగదుతో ప్రయాణిస్తుండగా, నిందితులు ముందస్తు పథకం ప్రకారం అతనిని అడ్డగించి కత్తితో బెదిరించి నగదును అపహరించారు. అనంతరం ఫిర్యాదుదారుతో పాటు ఉన్న బాబురెడ్డిని ఇన్నోవా వాహనం నుండి బలవంతంగా దింపివేసి అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఏర్పేడు పోలీసులు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. అదనపు ఎస్పీ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్‌డీపీవో వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటైంది. దర్యాప్తులో భాగంగా మంగళవారం సాయంత్రం ఏర్పేడు మండలం నీలాద్రి అపార్ట్‌మెంట్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కేసులోని ఎ-2 నుండి ఎ-9 వరకు ఉన్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వారు నేరానికి పాల్పడినట్లు అంగీకరించారు.అరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి దోచుకున్న నగదులో భాగంగా సుమారు రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నేరానికి వినియోగించిన ఒక ఇన్నోవా వాహనం, రెండు స్విఫ్ట్ డిజైర్ కార్లు, ఒక స్విఫ్ట్ కారు సహా మొత్తం నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన నిందితురాలు ఎ-1 లక్ష్మీకాంతమ్మ ప్రస్తుతం పరారీలో ఉండగా, ఆమెను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.దర్యాప్తులో నిందితులు కర్ణాటక రాష్ట్రంతో పాటు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. వీరిలో కొందరిపై గతంలో మోసం, దోపిడీ, దొంగతనం తదితర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.బాలసాల దామోదరం (54), నల్లంగాడు గ్రామం, బంగారుపాళ్యం మండలం, చిత్తూరు జిల్లా. పాసల వెంకటరమణ (49), శ్రీనివాస మంగాపురం, తిరుపతి. మునియప్ప వేంకటాచలపతి (54), కోలార్ జిల్లా, కర్ణాటక. నారాయణస్వామి (52), కోలార్ జిల్లా, కర్ణాటక.సయ్యద్ రోషన్ (36), మొగిలివెంకటగిరి గ్రామం, బంగారుపాళ్యం మండలం, చిత్తూరు జిల్లా..ఏ.అంజి @ మిద్దింటి అంజి (25), గంగాపురం గ్రామం, గంగవరం మండలం, చిత్తూరు జిల్లా. మద్దిపట్ల గుణశేఖర్ (58), జీవకోన మెయిన్ రోడ్, తిరుపతి. నసిన శ్రీనివాసులు (46), పునుగుంటపాలెం గ్రామం, చిల్లకూరు మండలం, నెల్లూరు జిల్లా.ఈ కేసును ఛేదించడంలో ఏర్పేడు సీఐ బి. శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐలు ఎన్. శ్రీకాంత్ రెడ్డి,కె. రవిప్రకాష్ పోలీసు సిబ్బంది విశేష కృషి చేశారు.ఈ సందర్భంగా జిల్లాఎస్పీఎల్.సుబ్బారాయుడు,మాట్లాడుతు ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు భంగం కలిగించే నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలను గుర్తించి చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఇటీవలి కాలంలో అధిక మొత్తంలో నగదు రవాణా చేసే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు ముందస్తుగా సమాచారాన్ని సేకరించి దోపిడీలు, మోసాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరు నేరగాళ్లు తాబేలు కనిపించడం, మూడు తలల పాము దర్శనం, ప్రత్యేక పూజలు చేస్తే అదృష్టం కలుగుతుందని, భారీ లాభాలు వస్తాయని, దాచిన నిధులు లభిస్తాయని వంటి మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని ప్రజలను నమ్మించి డబ్బులు కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు విలువైన వస్తువులు, బంగారం, పురాతన నాణేలు, అరుదైన వస్తువుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలి. పెద్ద మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులను తీసుకెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలి. నగదు రవాణా, ప్రయాణ వివరాలు లేదా విలువైన వస్తువులకు సంబంధించిన సమాచారాన్ని అనవసరంగా ఇతరులతో పంచుకోవద్దు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా మోసపూరిత ప్రలోభాలు ఎదురైన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930, మహిళల సహాయం కోసం 181 నంబర్లను సంప్రదించాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి!

● రు. 2 లక్షలు వరకు రుణమాఫీ చేయాలి.!

● నీటి ప్రాజెక్టు సత్వరం పూర్తి చేయాలి.!!

● 30 తేది న విజయవాడ లో జరిగే రైతుధర్నా జయప్రదం చేయండి!

● ఎపి రైతు సంఘం



తిరుపతి జూన్24 మనం న్యూస్:రైతులు పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ తో ఈనెల 30 తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం పిలుపిచ్చింది.. ఈ మేరకు రాయచోటి నియోజకవర్గం రైతు సంఘం సమావేశం వంగిమల్ల రంగా రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో జరిగిన సదస్సు లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. రామానాయుడు,, రైతు సంఘ నేత డా. టి. జనార్దన్,, ప్రధాన వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు,, కౌలు రైతులు రుణ భారం నుండి విముక్తి కావడానికి తెలంగాణా తరహాలో రు..2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఉధ్యాన హబ్ అంటూ ఊదరగొట్టడం తప్ప, నేడు, మామిడి,, బొప్పాయి,, అరటి,, ఉల్లి, నిమ్మ రైతులు గిట్టుబాటు ధరకు రోడ్డెక్కే స్థితి కల్పించబడిందని అన్నారు. వృద్ధాప్యం లో అన్నదాత కు ఆదుకొనేందుకు 50 సంవత్సరాలు పైబడిన రైతులకు రు. 10 వేలు పెన్షన్ చెల్లించాలని కోరారు.. పంటల బీమా పథకం అమలు చేసి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా లో కూడా మామిడి రైతులకు రు 4 సబ్సిడీ అందజేయాలని ఫ్యాక్టరీ యజమాన్యం, అక్రమాలు కట్టడి చేసి ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు..సిపిఐ, జిల్లా కార్యదర్శి మహేష్,, యంఆర్ పియస్ నేత రామాంజనేయులు మాట్లాడు తూ రైతులు జూన్ 30 న రైతు సంఘం చేపట్టే ఛలో విజయవాడ కు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.. ఈ సమావేశంలో, సిపిఐ,, ఏరియా కార్యదర్శి, శ్రీనివాస్ , గిరిజన రాష్ట్ర నేత విశ్వనాథ్ నాయక్, లు ప్రసంగించారు. కార్యక్రమం లో రైతుసంఘం ఏరియా అధ్యక్షులు హరినాథ్ నాయుడు,,విష్ణువర్ధన్ రెడ్డి, రమణారెడ్డి,, రమణ,,షబ్బీర్ బాషా, బ్రహ్మానంద రెడ్డి.. తదితరులు పాల్గొన్నారు.

# శభాష్... సిద్ధల లక్ష్మీదేవి..!!

● టీచర్‌గా పేరు తెచ్చుకుంటున్న మొలకవారిపల్లి బిడ్డ

● ఆమె బోధించే సాంఘిక శాస్త్రంలో అందరూ ఉత్తీర్ణు



మదనపల్లి రూరల్, జూన్ 24, మనం న్యూస్ : ఒక ఉపాధ్యాయురాలి అంకితభావం... ఒక గురువు బోధనలోని నాణ్యత.. విద్యార్థులు సాధించిన ఘన విజయం... ఇవన్నీ కలిస్తే విద్యా రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపిస్తున్నారు శివరామపురం జడ్పీ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సిద్ధల లక్ష్మీదేవి. సాధారణరైతు కుటుంబం. కురబలకోట మండలం అంగళ్ళు గ్రామం మొలకవారిపల్లికి చెందిన ఆమె ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేస్తున్నారు.కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివరామపురం జడ్పీ హైస్కూల్‌లో ఆమె బోధించే సాంఘిక శాస్త్రం సబ్జెక్టులో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడం విశేషం. అంతేకాకుండా టి.ఆర్. ఇందు అనే విద్యార్థిని సాంఘిక శాస్త్రంలో వందకు వంద మార్కులు సాధించడం పాఠశాల చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, పాఠాలను సులభంగా అర్థమయ్యేలా బోధించడం సిద్ధల లక్ష్మీదేవి ప్రత్యేకతగా సహచర ఉపాధ్యాయులు చెబుతున్నారు. తరగతి గదిలో పాఠాలు చెప్పడమే కాదు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, లక్ష్యాల వైపు నడిపించడం ఆమె విద్యాబోధనలో ముఖ్యాంశాలుగా నిలిచాయి. విద్యార్థిని ఇందు ప్రతిభను గుర్తించిన ప్రధానోపాధ్యాయులు సీ. గోపాలకృష్ణ, ఉపాధ్యాయురాలు సిద్ధల లక్ష్మీదేవి రూ.2,350 నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, సాంఘిక శాస్త్రంలో అందరూ ఉత్తీర్ణులు కావడం, ఒక విద్యార్థిని వందకు వంద మార్కులు సాధించడం వెనుక సిద్ధల లక్ష్మీదేవి కృషి, అంకితభావం ఎంతో ఉంది. ఆమె బోధన పట్ల ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనం అని ప్రశంసించారు.సాధారణంగా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధించడం కనిపిస్తుంటుంది. అయితే సాంఘిక శాస్త్రంలో పరిపూర్ణ మార్కులు సాధించడం అరుదైన విషయం. అలాంటి ఫలితాన్ని సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలిగా సిద్ధల లక్ష్మీదేవి ప్రశంసలు అందుకుంటున్నారు. ఆమె మరెంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని, విద్యా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తూ అభినందనల జల్లు కురిపిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

● టిడిపి బీసీ కుల సంఘాల నాయకులు




తిరుపతి ప్రెస్ క్లబ్ జూన్ 24 మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్లో నీ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి బీసీ గాండ్ల సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు జగన్నాథం అన్నారు .బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీ విద్యార్థులకు పెద్దపీట వేస్తుందని,విద్య తోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనే దృఢ సంకల్పంతో క్యాబినెట్ మీటింగ్ లో కీలక నిర్ణయం తీసుకున్నందుకుగాను కూటమి ప్రభుత్వానికి బీసీలు పట్ల ఉన్న గౌరవం అని, ఇటువంటి ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్,బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మకి గాండ్ల సంక్షేమ సాధికార సమితి నాయకులు జగన్నాథం ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో కొత్తగా 10 మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం,బీసీ విద్యార్థుల ఎన్నెముకగా కూటమి ప్రభుత్వం ఉందనడానికి నిదర్శనం అన్నారు. రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అక్కినపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇటీవల ఆరు గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం 10 గురుకులాల్లో ఒక్కో దాంట్లో 37 మంది చొప్పున ఉద్యోగుల భర్తీకి కూడా ఆమోదం తెలిపిందని అన్నారు.యాదవ సాధికారిక కమిటీ స్టేట్ మెంబర్ సత్తు మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ విద్య పట్ల నారా లోకేష్ అవలంబిస్తున్న విధానాల వల్లనే విద్యార్థుల్లో మెరుగైన రిజల్ట్ వచ్చిందని, పాఠశాలలో,కాలేజీలు పట్ల లోకేష్ తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయాల వల్ల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని,ప్రయోజకులు అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.బీసీ విద్యార్థుల పట్ల నారా లోకేష్,బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మ తీసుకున్న నిర్ణయాలు బీసీ విద్యార్థులకు ఒక వరంగా మారిందన్నారు. బీసీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇంతటి ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రవి, ఆముదాల తులసీదాస్, నాయి బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు అద్దంకి బాలరాజు,శ్రీనివాసులు సురేష్ తదితరులు

## భాకరాపేట ఘాట్లో అదుపుతప్పి రక్షణ గోడ పైకి దూసుకెళ్లిన లారీ.



చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో లారీ అదుపు తప్పింది.మదనపల్లె వైపు నుంచి తిరుపతి వైపు వస్తున్న గ్రానైట్ రాళ్ల లారీ భాకరాపేట ఘాట్ రోడ్డులో మలుపు వద్దకు రాగానే అదుపు తప్పింది. రోడ్డు పక్కన రక్షణ గోడపైకి ఎక్కింది. అది లేకుండా ఉంటే సుమారు వంద అడుగుల లోయలో దూసుకెళ్లి ఘోర ప్రమాదమే చోటు చేసుకునేది.రక్షణ గోడ వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని వాహనదారులు పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు.

## వాసు ట్రస్ట్ చే నోటు పుస్తకాల పంపిణీ



ఐరాల జూన్ 24.మనం న్యూస్:వాసు ట్రస్టు ద్వారాఐరాల మండలంలోని 35 యర్లంపల్లి ,నాగంవాండ్లపల్లి, చెంగనపల్లి,పంచాయతీలలోని 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని దాదాపు 200 మంది విద్యార్థులకు వాసు ట్రస్ట్ వ్యవస్థాపకులు సింగపూర్ లో స్థిరపడిన సంపతి ఈశ్వర్ ,35 యర్లంపల్లి గ్రామ వాస్తవ్యులు సూరిమాని రాజారాం పిల్లలకు నోటు పుస్తకాలు,పెన్సిళ్లు, పెన్నులు,పలకలు ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు.వాసు ట్రస్టు గత 19 సంవత్సరాలుగా వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ చేయడమైనది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రుషేంద్రబాబు, భానుప్రసాద్ , మాట్లాడుతూ వాసు ట్రస్ట్ సేవలను కొనియాడారు.అలాగే వీరి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యస్వీ జూపార్క్ మాజీ డైరెక్టర్ మణియాదవ్,బిసి సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.జనార్దన్, పి.అమ్ములు,చలపతి,రజని, గంగిరెడ్డి,గుణసుందరి,మహాదేవి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవన ఎరువులు వినియోగించడం ద్వారా భూమి సారవంతం అవుతుంది--!

● పూతలపట్టు వ్యవసాయ అధికారిని మధురవాణి



పూతలపట్టు జూన్ 24 మనం న్యూస్: జీవన ఎరువులు వినియోగించడం వలన భూమి సారవంతం అవుతుందని పూతలపట్టు వ్యవసాయ అధికారిని మధురవాణి రైతులకు స్పష్టం చేశారు.కెత్ బచావో అభయాన్ రైతన్న మీకోసం కార్యక్రమం వేనూతనపల్లి కొత్తూరు పూతలపట్టు రైతు సేవా కేంద్ర పరిధిలో బుధవారం కార్యక్రమంనిర్వహించడం జరిగింది అని మండల వ్యవసాయ అధికారిణి మధురవాణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం నుండి వచ్చిన శాస్త్రవేత్తలు ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ నేల సంరక్షణ గురించి వివరించారు. సేంద్రీయ ఎరువులు వినియోగించాలని, భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వేయాలని, అలాగే పచ్చిరొట్ట ఎరువులు వేయాలని, జీవన ఎరువులు వినియోగించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, సూక్ష్మజీవులు పెరుగుతాయని తద్వారా మొక్కకు పోషకాలు అందుబాటులోకి వచ్చి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పంటలను ఆశించే చీడ పీడలు నివారణ చర్యలను గురించి వివరించారు, జిల్లా వనరుల కేంద్ర నుండి వచ్చిన లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ మన వ్యవసాయ విధానం లో మార్పు రావాలని సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరించి నేల ను సంరక్షణ చేయాలని విచక్షణ రహితంగా పురుగు మందులు వాడరాదని తెలిపారు, పూతలపట్టు మండల వ్యవసాయ అధికారిణి మధురవాణి మాట్లాడుతూ ఇకపై ఎరువులు భూసార పరీక్ష ఆధారంగా పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఏ,పీ, ఏ,ఐ,ఎం, అనే యాప్ ద్వారా మాత్రమే యూరియా డి,ఎ,పి, ఎరువులు అందించడం జరుగుతుందని తెలిపారు, అంతేకాక ప్రతి రైతుకు ఏ,పీ, ఎఫ్,ఆర్, ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని తెలిపారు, వి ,సి ,సి,అనే పథకం కింద సోయా బీన్ సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏ,ఎ,ఓ ప్రసన్న కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డును రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్



తిరుపతి రూరల్ 24 మనం న్యూస్:తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలోని మార్కెట్ యార్డ్ నుంచి తాజ్ సర్కిల్ వరకు రూ.1 కోటి 45 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్ , చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని,జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తోకలిసి ప్రారంభించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అలాగే సీసీ రోడ్లకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.అనంతరం తిరుచానూరు ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు రోడ్లు, తాగునీరు వంటి మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు .

## నిరుపేద కుటుంబముకు తాళిబొట్టు కోసం 11,106 సహాయం

● కొత్త పేటయూనిట్ ఇంచార్జ్ ముఖేష్



కుప్పం జూన్24 మనం న్యూస్:కు ప్పం మున్సిపాలిటీ కొత్తపేట 14వ వార్డు కు సంబంధించిన లక్ష్మి రఘు దంపతులు 20 సంవత్సరాల నుండి బాడుగ ఇంట్లో కాపురం ఉంటు, రోజువారి కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె గంగాకు బుదువారం వివాహమైంది. పేదవారైనా వీరు కుమార్తె పెళ్లి ఖర్చు పెనుబారమైన కారణంగా తెలుగుదేశం పార్టీ కొత్తపేట యూనిటీ ఇన్చార్జ్ అప్పు ముకేశ్ సహాయం చేయమని అడగగా పెళ్లి కుమార్తె తాళిబొట్టు అయ్యే ఖర్చు భరిస్తారని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుదవారంఆ తాళిబొట్టుకు ఖర్చు 11106/ రూ పెళ్లికూతురు గంగాకి అందజేసి వందేళ్లు పిల్లాపాపలతో అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆస్వాదించారు ఆ కుటుంబ సభ్యులు యూనిట్ ఇంచార్జ్ ముఖేష్ కు ధన్యవాదాలు తెలిపారు



## పద్మసరోవరంలో దివ్యంగా శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

● జూన్ 25 నుండి 29 వరకు ఐదు రోజుల మహోత్సవ వైభవం

● భక్తులను కరుణించనున్న శ్రీ పద్మావతి అమ్మవారు

● భక్తి, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరుచానూరు ఆధ్యాత్మిక శోభ

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు జూన్ 25 నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు పద్మసరోవరంలో సుందరంగా అలంకరించిన తెప్పలపై విహరిస్తూ శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు జరిగే ఈ పవిత్ర తెప్పోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటే భక్తుల కష్టాలు తొలగి, దైవానుగ్రహంతో సుఖశాంతులు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**భక్తులను కాపాడే పద్మావతి అమ్మవారు**

పద్మసరోవరంలోని బంగారు పద్మం నుండి అవతరించిన శ్రీ పద్మావతి అమ్మవారు జగజ్జననిగా భక్తులను అన్ని కష్టాల నుండి కాపాడి, సుఖశాంతులు ప్రసాదిస్తారనే ఆధ్యాత్మిక సందేశాన్ని తెప్పోత్సవాలు తెలియజేస్తాయి. పద్మసరోవరంలో అమ్మవారి తెప్ప విహారం దర్శించుకోవడం భక్తులకు అపూర్వమైన దివ్యానుభూతిని కలిగిస్తుంది.

## అక్రమ కేసులు, షోకాజ్ నోటీసులతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కివేయలేరు

● మల్లం రవిచంద్రారెడ్డి



ఈస్ట్ పోలీసుల ఫిర్యాదు మేరకు తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి గారికి, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గీతా యాదవ్ గారికి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ పసుపులేటి సురేష్ రాయల్ గారికి, జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు అనిల్ గారికి జారీ చేసిన షోకాజ్ నోటీసులకు సంబంధించి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులతో కలిసి తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా వివరణ సమర్పించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజా వ్యతిరేక విధానాలను, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతును అణిచివేసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన వ్యవస్థలు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే, రాజకీయ కక్షసాధింపులో భాగంగా నమోదు చేసే అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడబోరని, ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు ఐసీఎస్ చంద్రశేఖర్ రెడ్డి గారు, విజయ్ కుమార్ గారు, రాజశేఖర్ గారు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తి సింహాద్రి అరెస్టు




వెదురు కుప్పం. మనం న్యూస్ జూన్ 24: వెదురు కుప్పం మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక మైనర్ బాలిక అదృశ్య కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించబడింది. మైనర్ బాలిక అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు వేదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బాలికను గుర్తించి ఆమె వాంగ్మూలం నమోదు చేయగా, నిందితుడు ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసగించి తన వెంట తీసుకెళ్లినట్లు మరియు ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. దీనితో కేసును సంబంధిత సెక్షన్లు మరియు పోక్సో చట్టం సెక్షన్ల కింద మార్చి దర్యాప్తు కొనసాగించారు. ఈ నేపథ్యంలో, నిందితుడు ఎం. సింహాద్రి ను 24-06-2026 తేదీన పచ్చికాపలం జంక్షన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా, న్యాయస్థానం అతనికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మైనర్ బాలికలపై జరిగే నేరాల పట్ల జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని నేరానికి పాల్పడిన వారిపై సెక్సువల్ ఒఫ్ఫెండర్ షీట్స్ ఓపెన్ చేసి వారి పై నిరంతర నిఘా ఉంచుతారని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది సభ్యుని ఇన్స్పెక్టర్ హనుమంతప్ప, రమణబాబు, ముని రెడ్డి, ఉన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్ ను కలిసిన షేక్ హనీఫ్.



కలికిరి జూన్ 24 మనం న్యూస్ :మాజీ సీఎం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో వైకాపా కలికిరి గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ హనీఫ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు పులివెందులలోని మాజీ సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టిష్టతకు కృషి చేయాలని మాజీ సీఎం, షేక్ హనీఫ్ కు సూచించారు.

## పీలేరు మండల విద్యాశాఖాధికారి 1 గా బాధ్యతలు చేపట్టిన బుక్కే బాబు నాయక్.



పీలేరుజూన్ 24 మనం న్యూస్: మదనపల్లి ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బుక్కే బాబు నాయక్ ని పీలేరు మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతనిస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు ప్రకారం బుధవారం సాయంత్రం మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల విద్యాశాఖ అధికారిబాబునాయక్ కి శాలువాతో సత్కారం చేశారు. మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టినందుకు పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి పద్మావతి, అన్నమయ్య జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ కార్యదర్శి గంగాధరం, మాజీ మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయసంఘాలు విద్యాశాఖ కార్యాలయ సిఆర్పిలు సిబ్బంది పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ: కోట దానియల్ మాదిగ



పీలేరు జూన్ 24మనం న్యూస్:మానవసేవే మాధవసేవ అని ఎన్.ఆర్.పి.ఎస్ అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ కోట దానియల్ మాదిగ పేర్కొన్నారు. ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు రాష్ట్రంలో విద్యార్థినీ విద్యార్థుల చదువు వెనుకబడకుండా ఉండేందుకు గోటు విలేజ్ కార్యక్రమం నిర్వహించబడుచున్నది అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా ఇన్చార్జి కోట దానియల్ మాదిగ కడప జిల్లాలో తాత్కాలికంగా ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాలెం రాజుపాలెం మండలం వెలవలి గ్రామంలో గోటువిలేజ్ కార్యక్రమంలో తల్లిని కోల్పోయి చదువు మధ్యలో ఆగిపోయినటువంటి పసల. శ్రీనివాసును గుర్తించి పొద్దుటూరు నియోజకవర్గ సీనియర్ నాయకత్వం లో ఐటిఐ కాలేజీలో చేర్పించడానికి శివ మాదిగ జగదీష్ మాదిగ చిన్నయ్య మాదిగ చొరవ తీసుకున్నారు అలాగే సమస్యను ఫోను ద్వారా మాట్లాడిన వెంటనే శ్రీనివాసకు నూతన వస్త్రాలు, ఇతర వస్తువులకు ఎంఆర్పిఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వై రవీంద్ర మాదిగ, పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, కో ఇన్చార్జ్ ముల్లంగి రెడ్డప్ప , సీనియర్ నాయకులు రవి ఈశ్వర, వాల్మీకిపురం మండలఅధ్యక్షులు బాలకృష్ణ లు ఆర్థిక సహాయం అందజేసి విద్యార్థిచెడుమార్గం పట్టకుండా చదువుకునేందుకుమార్గం చూపించితమ మానవత్వాన్ని చాటుకున్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి మానవత్వం చాటుకున్న ఎన్.ఆర్. పేట పోలీసులు



చిత్తూరు జూన్24 మనం న్యూస్:చిత్తూరు జిల్లా ఎన్.ఆర్. పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సంచరిస్తున్న ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించి, అతని కుటుంబ సభ్యుల ఆచూకీ కనుగొని సురక్షితంగా చెంతకు చేర్చిన ఎన్.ఆర్. పేట పోలీసులు తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.అస్సాం రాష్ట్రం నాగావ్ జిల్లా, గాంధీబారి ప్రాంతానికి చెందిన లక్ష్మి ప్రసాద్ బోర్డోలోయ్ అనే వ్యక్తి అస్సాం నుండి కేరళకు కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా, మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పొరపాటున జూన్15న ఎన్.ఆర్. పేట ప్రాంతంలో దిగిపోయి అక్కడే తిరుగుతూ ఉన్నాడు.ఈ విషయాన్ని గుర్తించిన ఎన్.ఆర్. పేట పోలీసులు అతనిని సంరక్షణలోకి తీసుకొని, అతని వివరాలను సేకరించి కుటుంబ సభ్యుల కోసం విస్తృతంగా ప్రయత్నాలు చేపట్టారు. అనంతరం అస్సాం రాష్ట్రంలోని అతని బంధువులను సంప్రదించి సమాచారం అందించారు. ఈరోజు అతని అన్నగారు ఎన్.ఆర్. పేటకు చేరుకోగా, తగిన ధృవీకరణ అనంతరం లక్ష్మి ప్రసాద్ బోర్డోలోయ్‌ను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.తమ కుటుంబ సభ్యుడిని క్షేమంగా అప్పగించినందుకు కుటుంబ సభ్యులు ఎన్.ఆర్. పేట పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఎన్.ఆర్. పేట పోలీసుల సేవాభావాన్ని, మానవతా దృక్పథాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు పోలీసులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## తిరుమలలో ఆధ్యాత్మిక వనాలను విరివిగా అభివృద్ధి చేయాలి : టీటీడీ అదనపు ఈవో



తిరుమల, జూన్ 24,మనం న్యూస్:తిరుమలలో ఆధ్యాత్మిక వనాలను, ఔషధ వనాలను విరివిగా అభివృద్ధి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.తిరుమలలో జి ఎన్ సి, గీత పార్క్,నామాల పార్క్ వంటి వివిధ ఉద్యానవనాలను ఆయన బుధవారం పరిశీలించి టీటీడీ ఉద్యానవన, అటవీ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రానున్న బ్రహ్మోత్సవాలకు తిరుమలలోని ఉద్యానవనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న మొక్కలను పెంచేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.టీటీడీ ఫారెస్ట్ విభాగం డిప్యూటీ సీఎఫ్ ఫణి కుమార్ నాయుడు,ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దామును పరామర్శించిన టిడిపి రాష్ట్ర నాయకులు గంగారపు గోపి -!



పూతలపట్టు జూన్ 24 మనం న్యూస్:రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి డిజిటల్ ఫోటో స్టూడియో యజమాని దామును బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గంగారపు గోపి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు గొడుగు చింత దాము పూతలపట్టు నందు సాయి డిజిటల్ ఫోటో స్టూడియో నడుపుతున్నాడు. నాలుగు రోజుల క్రితం స్వగ్రామం వెళ్లడానికి పూతలపట్టు నుండి రంగంపేట క్రాస్ మీదుగా వెళుతూ ఉండగా తిరుపతి నుండి చిత్తూరు వైపుగా వస్తున్న కారు అతివేగంగా డ్రైవింగ్ చేసి తన వెళుతున్న స్కూటర్లను ఢీకొట్టడంతో అతను తీవ్ర గాయాలు అయింది. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతిలోని నారాయణద్రి హాస్పిటల్ నందు తరలించారు. ప్రమాదం జరిగిన అప్పుడు గంగారపు గోపి శ్రీలంకలో ఉండగా ఆ సమయంలో రావడానికి వీలు లేనందున బుధవారం తిరుపతికి వెళ్లే దామును ఆయన పరామర్శించారు. ఆయనతోపాటు పూతలు పట్టు సింగల్ విండో అధ్యక్షులు జగన్నాథం , దేశం నాయకులు మధుబాబు, తదితర తెలుగుదేశం నాయకులు పరామర్శించారు.



## స్థానిక సంస్థ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయభేరి మోగించాలి

● సత్తి వేడు నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ ఇంచార్జి కోనేటి సుమన్ కుమార్

పుత్తూరు జూన్ 24 మనం న్యూస్ నారాయణవనం సమావేశానికి భారీ స్థాయిలో తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులుస్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకునే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బూతు లెవెల్ ఏజెంట్ ఇంచార్జి కోనేటి సుమన్ కుమార్ వెల్లడించారుబుధవారం సాయంత్రం నారాయణవనం శ్రీ దుండి వినాయకుని ఆలయ ఆవరణలో జరిగిన బూత్ లెవెల్ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారుఈ సందర్భంగా కోనేటి సుమన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గార్లు పనిచేస్తున్నారని గుర్తు చేశారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి ఇస్తూ మంచి వ్యక్తుల్ని అభ్యర్థుల నిలబెట్టి గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులు కార్యకర్తలుదే అని తెలిపారుతెలుగుదేశం పార్టీ అభ్యర్థుల కృషికి తన వంతు సహకారం తప్పక ఉంటుందని ప్రధానంగా విభేదాలు ఎన్ని ఉన్నా అందరూ ఐక్యమత్యంగా ముందుకు వెళ్లామని గుర్తు చేశారుఈ సమావేశానికి సుమారు 450 మంది వరకు నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు తరలివచ్చారుఅనంతరం కోనేటి సుమన్ కుమార్ గారిని దుశ్శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు

## మామిడిగుజ్జు పరిశ్రమలో పనులు చేస్తున్న బాల కార్మికులు--!

● అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం--!



పూతలపట్టు జూన్ 24 మనం న్యూస్:బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించాలి ,బాల కార్మికుల లేని దేశాన్ని, రాష్ట్రాన్ని, చూడాలని దేశస్థాయి నుండి, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మండల స్థాయి వరకు అధికారులు ప్రకటనలు చేస్తూ ప్రగల్ బాలు పలుకుతున్నారే తప్ప ఆచరణలో ఏమాత్రం నోచుకో లేదు. బడిలో ఉండాల్సిన పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు.ఇందుకు నిదర్శనం పూతలపట్టు మండలంలోని మామిడి పండ్లు గుజ్జుపరిశ్రమంలో బాల కార్మికులు పనులు చేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలోని సుమారు 5 మామిడి గుజ్జుపరిశ్రమలు ఉన్నాయి .అందులో పనిచేయడం కోసం కాంట్రాక్టర్లు అస్సాం, రాజస్థాన్ ,నుండి కూలీలను తీసుకొని వచ్చే పనులు చేపిస్తూ ఉంటారు. అందులో అధిక సంఖ్యలో బాల కార్మికులను తీసుకు వచ్చి గుజ్జు పరిశ్రమలో పనులు చేపించి పరిశ్రమల యజమానుల దగ్గర అధిక మొత్తంలో వసూలు చేసుకుని బాల కార్మికులైన పిల్లలకు కొంత మొత్తం చెల్లించి లక్షల దండుకుంటున్నారు. మండలంలో ఉన్న పరిశ్రమలను మండల స్థాయి అధికారులు కానీ ఇంతవరకు పర్యవేక్షణ చేయకుండా ఉండడంతో యజమానులు ఇ ష్టారాజ్యంగా పిల్లలు చేత పనులు చేయించుకుంటారు .

బడి బయట పిల్లలు బడిలోనే ఉండాలని ఉపాధ్యాయులు ఈ వేసవి సెలవుల్లో ప్రతి గ్రామంలో చుట్టి బడిలో చేర్పించండి అంటూ తూ తూ మంత్రంగా ప్రచారం చేసారేతప్ప ఏ ఒక్క ఉపాధ్యాయులకు కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మండలంలో ఉన్న గుజ్జుపరిశ్రమల వద్ద వెళ్లకపోవడం తో ఇష్టారాజ్యంగా పిల్లల చేత పనులు చేయించుకుంటున్నారు. మామిడిపండ్ల సీజన్ వచ్చిందంటే సుమారు రెండు మూడు నెలల వరకు ఇతర రాష్ట్రాల నుండి పిల్లలను తీసుకొని వచ్చే పనులు చేయించుకుంటున్నా. దీనిని నిర్మూలించాలంటే అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని గుజ్జు పరిశ్రమలను పర్యవేక్షణ చేస్తే తప్ప ఇలాంటి సంఘటనలు చోటు చోటు చేసుకోదనిపలువురు అంటున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు మామిడి గుజ్జుపరిశ్రమలో పర్యవేక్షణ చేసి బాల కార్మికులకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## రోలవారిపల్లి ఆరేటమ్మ కుంభాభి అభిషేకం లోపాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ వైసీపీ నాయకులు..



బంగారుపాలెం జూన్ 24 మనం న్యూస్. బంగారుపాలెం మండలంలోని కూర్మాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసియున్న ఆరేటమ్మ దేవాలయంలో కుంభాభిషేకంలో బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పూతలపట్టు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్. వైయస్సార్ పార్టీ యువ నాయకులు హరికృష్ణ రెడ్డి. బాబు. మిధున యువసేన అధ్యక్షులు సోషల్ మీడియా యువ నాయకుడు కిషోర్ కుమార్ రెడ్డి. పలువురు వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆరేటమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆలయ అర్చకులు గ్రామస్తులు మాజీ పూతలపటం సభ్యులకు డాక్టర్ సునీల్ కుమార్ కు ఆలయ ప్రసాద్ అందించి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డి. మండల బూత్ కమిటీ కోఆర్డినేటర్ తగ్గువారిపల్లి జగదీష్. ఈశ్వర్ రెడ్డి. రవి రెడ్డి. హరికృష్ణ రెడ్డి. ఆనంద్ రెడ్డి. పలు వైఎస్ఆర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అబ్జర్వర్ గా నాగభూషణం



సోమల జూన్ 24 మనం న్యూస్:జనసేన పార్టీ తరఫున రాజంపేట పార్లమెంటు సిగ్మెట్ అబ్జర్వర్లు ను పార్టీ బుధవారం నియమించింది. ఈ నేపథ్యంలో సోమలకు చెందిన నాగభూషణం రాయల్ ను పుంగనూరు నియోజకవర్గం అబ్జర్వర్ గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తన మీద నమ్మకంతో నియమించడం జరిగిందన్నారు. పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ నియోజకవర్గ ప్రజలు జనసేన పార్టీ మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం


● రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ విభజనతో తిరుపతి ప్రజలకు మెరుగైన సేవలు

● భూ రీ-సర్వే 2.0 ద్వారా పారదర్శక భూ పరిపాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● మార్కెట్ యార్డ్ నుండి తాజ్ సర్కిల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం

● తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు శాశ్వత పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ

● :జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్



తిరుపతి, జూన్ 24: తిరుపతి ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్న రిజిస్ట్రేషన్ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విభజించి తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

బుధవారం తిరుచానూరులో ఏర్పాటు చేసిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ కమిషనర్ మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దుగ్గుమల్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్ లావాదేవీలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుచానూరు ప్రాంతంలో ఉన్న పాత సచివాలయ భవనాన్ని ఆధునీకరించి తాత్కాలికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మార్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత భవనాన్ని నిర్మించి అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కూడా రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే 2.0 కార్యక్రమంపై మంత్రి ప్రత్యేకంగా స్పందిస్తూ, గతంలో సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, ప్రస్తుతం ప్రతి పట్టాదారుకు పూర్తి సమాచారం అందిస్తూ అత్యంత పారదర్శకంగా రీ-సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. వాట్సాప్ గ్రూపులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ, ఈ-కేవైసీ ధృవీకరణ వంటి విధానాల ద్వారా భూ యజమానుల సమ్మతి, ధృవీకరణ అనంతరమే సర్వే పూర్తయినట్లు నిర్ధారిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన సుమారు 7.5 లక్షల ఫిర్యాదులు, దరఖాస్తులను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూమి వివాదాలు, 22-ఏ భూములకు సంబంధించిన అంశాలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు ఏర్పాటు చేయనున్న శాశ్వత పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ పైప్‌లైన్ పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం కానుందని తెలిపారు. అనంతరం శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో మార్కెట్ యార్డ్ నుండి తాజ్ సర్కిల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు మరియు మురుగు కాలువలను మంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ పనులు ప్రాంతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుధ్య సౌకర్యాలను అందించనున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ శ్రీ రామ్మోహన్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీ రామ్‌కుమార్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ నరసింహ యాదవ్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ రుద్రకోటి సదాశివం, ప్రజాప్రతినిధులు, అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళలపై నేరాలు, శక్తి యాప్ డ్రగ్స్ దుష్పరిణామాలపై

# అవగాహన కల్పించిన చిత్తూరు జిల్లా పోలీసులు.



చిత్తూరు జూన్24 మనం న్యూస్చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి,ఆదేశాల మేరకు, చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ సుబ్బా రెడ్డి సిబ్బంది ఈరోజు చిత్తూరు పట్టణంలోని పి.సి.ఆర్ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళలపై జరిగే నేరాలు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ప్రాముఖ్యత, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు మరియు వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. మహిళలు బాలికలు ఎలాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొన్నా శక్తి యాప్ ద్వారా తక్షణమే పోలీసులకు సమాచారం అందించవచ్చని, యాప్‌లోని SOS బటన్‌ను ఉపయోగించడం ద్వారా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరి వెంటనేసహాయంఅందుతుందని వివరించారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు.అలాగే విద్యాసంస్థల్లో ర్యాగింగ్ మరియు ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలు చట్టరీత్యా నేరాలని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, అత్యవసర సహాయం కోసం 112 ఎమర్జెన్సీ నంబర్ ఇతర హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ ఏ.ఎస్.ఐ. శ్రీ వెంకటేష్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం 3 ప్రత్యేక తీర్థయాత్ర టూరిస్ట్ రైలు



తిరుపతి, జూన్ 24: తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఐఆర్‌సీటీసీ జూలై–ఆగస్టు నెలల్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా మూడు ప్రత్యేక తీర్థయాత్ర ప్యాకేజీలను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ జి. సోమశేఖర్ నాయుడు, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ సమావేశంలో వివరించారు.మొదటి ప్యాకేజీగా అయోధ్య–కాశీ–బైద్యనాథ్ ధామ్ యాత్ర జూలై 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఈ యాత్రలో గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్, బైద్యనాథ్ ధామ్ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంటుంది. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,400గా నిర్ణయించారు. రెండో ప్యాకేజీ దివ్య దక్షిణ యాత్ర జూలై 20 నుంచి 28 వరకు సాగుతుంది. ఈ యాత్రలో అరుణాచలం, చిదంబరం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.15,600గా ఉంది.మూడో ప్యాకేజీ అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర ఆగస్టు 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. పూరి, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాలను ఈ యాత్రలో సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,500గా నిర్ణయించారు.ఈ యాత్రలకు స్లీపర్, 3ఏసీ, 2ఏసీ తరగతుల్లో టికెట్లు అందుబాటులో ఉండగా, ధరలు రూ.15,600 నుంచి రూ.33,400 వరకు ఉన్నాయి. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్ వసతి, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, ఉచిత తాగునీరు, ప్రయాణ బీమా, సీసీ కెమెరాలు మరియు సెక్యూరిటీ సిబ్బందితో భద్రత, అలాగే దేవాలయాలకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు.అదనంగా నేపాల్, సింగపూర్–మలేషియా, శ్రీలంక రామాయణ యాత్రలతో పాటు గంగా గయా సంగం, కేరళ, లేహ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, గోవా, ఒడిశా, మహారాష్ట్ర, చార్ ధామ్ యాత్రలకు సంబంధించిన విమాన పర్యటన ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టికెట్ బుకింగ్ వివరాలుకోసం 9281495853, 8287932313 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్. అశోక్ కుమార్ పవన్, వీరన్న మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి

# దివ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● జూన్ 25న ధ్వజారోహణంతో వైభవోత్సవాల ప్రారంభం

● గోవింద నామస్మరణతో మారుమోగనున్న అప్పలాయగుంట



తిరుపతి(టిటిడి), జూన్ 24, మనం న్యూస్:అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మేదినిపూజ నిర్వహించి, అనంతరం సేనాధిపతి ఉత్సవాన్ని చేపట్టారు.సంప్రదాయం ప్రకారం శ్రీ విష్వక్సేనులవారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి, అన్ని కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. అనంతరం యాగశాలలో అంకురార్పణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు మంగళారంభం పలికారు.జూన్ 25న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాల ప్రారంభంజూన్ 25 గురువారం ఉదయం 8.30 గంటల నుండి 9.00 గంటల మధ్య కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.దివ్య వాహనసేవలతో భక్తులకు ఆధ్యాత్మికానందంబ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.వాహనసేవల వివరాలుజూన్ 25 – ధ్వజారోహణం, పెద్దశేష వాహనం,జూన్ 26 – చిన్నశేష వాహనం, హంస వాహనం,జూన్ 27 – సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం,జూన్ 28 – కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం,జూన్ 29 – మోహినీ అవతారం, గరుడ వాహనం,జూన్ 30 – హనుమంత వాహనం, గజ వాహనం,జూలై 1 – సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం,జూలై 2 – రథోత్సవం, అశ్వవాహనం,జూలై 3 – చక్రస్నానం, ధ్వజావరోహణం.భక్తి, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలుబ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనున్నారు.



## గాదంకి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

● 8 మందికి గాయాలు

పాకాల జూన్ 24 మనం న్యూస్: తిరుపతి జిల్లా పాకాల మండలం గాదంకి గ్రామం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో 8 మంది గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన షేక్ బాజీబాబా నడుపుతున్న ప్లైవుడ్ లోడుతో కూడిన లారీ బెంగళూరు నుంచి శ్రీకాళహస్తి సమీపంలోని చింపేడు గ్రామంలోని కట్టెల ఫ్యాక్టరీకి వెళ్తోంది. ఇదే సమయంలో యాదమరి మండలం పెరుమాల్లపల్లి గ్రామం నుంచి తిరుపతిలో బంధువుల వివాహానికి వెళ్తున్న ఆటో గాదంకి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుంది.మధ్యాహ్నం ప్రాంతంలో ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఎలాంటి హెచ్చరిక సూచనలు ఇవ్వకుండా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ఆటో లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తవణంపల్లి మండలం ఏనుగుంటపల్లికి చెందిన యనమల మాధవి (40), ఆమె కుమార్తె మేఘన (15) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన యాదమరి మండలం పెరుమల్లపల్లికి చెందిన పులకింటి రాజశేఖర్ (25)ను తిరుపతి రుయా ఆసుపత్రికి చికిత్స పొందుతూ మృతి చెందాడు.